www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

అటవీ శాఖ సిబ్బందికి డార్టింగ్ గన్‌పై శిక్షణ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె డివిజన్ అటవీ శాఖ సిబ్బందికి ప్రముఖ వన్యప్రాణి నిపుణులు డాక్టర్ షిరిన్ లారెన్స్ సోమవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో బ్లోపైప్, డార్టింగ్‌గన్ పై ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణలో వన్యప్రాణులను శాంతింపచేయడానికి ఉపయోగించే బ్లో పైప్, డార్టింగ్ గన్ వాడకంపై ప్రయోగాత్మకమైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమం ప్రాథమికంగా మనుషులు-వన్యప్రాణుల మధ్య ఘర్షణలు నివారించడం, ప్రాణి, మానవ భద్రతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మదనపల్లెలో చిరుతపులులు, మొదలైన వన్యప్రాణులతో మానవుల మధ్య ఘర్షణలు తరచుగా నమోదవుతున్న నేపథ్యంలో సిబ్బంది త్వరితమైన, ప్రభావవంతమైన చర్యలు తీసుకోవడానికి ఈ శిక్షణ సహాయకరంగా ఉంటుందని ఎఫ్ఆర్ఓ జయప్రసాద్‌రావ్ తెలిపారు.

డార్టింగ్ గన్‌పై శిక్షణ ఇస్తున్న డాక్టర్ షిరిన్ లారెన్స్

అక్రమ వసూళ్లపై విచారణ జరిపించండి

- మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌కు సిఐటియు నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మున్సిపల్ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) సమస్యలు పరిష్కారమిస్తామనే సాకుతో యూనియన్ల పేరుతో చందాలు చేసుకున్న అక్రమ వసూళ్లపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్, చైర్మన్లకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ నుంచి ఆప్కాస్ విధానంలోకి మార్చు చేసే సందర్భంలో ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో అనేక సమస్యలు వచ్చాయని వివరించారు. పిఎఫ్ ఖాతా నుండి డబ్బులు తీసుకోలేక పోవడం, పిఎఫ్ ఖాతాలో నగదు జమ కాకపోవడం లాంటి సమస్యలతో కార్మికులు సతమతమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యల నేపథ్యంలో యూనియన్ నాయకులమని చెప్పుకొని పిఎఫ్ సమస్యలను పరిష్కరిస్తామంటూ కొందరు నాయకులు కార్మికుల వద్ద వేలల్లో నగదు వసూలు చేసి దోచుకుంటున్న దాఖలాలు అధికమవుతున్నాయని చెప్పారు. సమస్యలు పరిష్కారం కాని వారు తమ డబ్బులు వెనక్కివ్వాలని అడిగితే దాడులు చేయడమే కాకుండా ఉద్యోగాలు ఊడపీకుతామంటూ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వసూళ్లపై సమగ్ర విచారణ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం రోజైన మే ఒకటో తేదీన వేడుకలు నిర్వహించాలని మున్సిపల్ కార్మికులు పనిచేసే ప్రతి డివిజన్‌లోనూ, మస్టర్ల పాయింట్ల వద్ద సిఐటియు జెండా ఎగురవేస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.రాజే శ్వరి, డి.ప్రభాకర్‌రెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు మధురవాణి, ఆటో కార్మిక నాయకులు నాగరాజు, ట్రాన్స్ కోవిభాగం నాయకులు నారాయణ, ఐటియుసి కన్వీనర్ జి.కృష్ణమూర్తి, మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, నాయకులు చలపతి నాయుడు, రామ కృష్ణ, గోపాల్, కృష్ణమూర్తి, అరవింద్, సంగీత, శంకరమ్మ, తులసమ్మ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ మనూజరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని, ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

పిల్లలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : జెవివి

ప్రజాశక్తి - రాయచోటి

పిల్లలు నైపుణాలను పెందపొందంచుకోవాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో పిల్లలకు పేపర్ క్రాఫ్ట్ నైపుణ్యాలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వేసవిలో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపుతూ సృజనాత్మక నైపుణ్యాలను నేర్పించే ఉద్దేశంతో ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు గోపాల్ దాస్, రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు కాగితంతో వివిధ రకాల బొమ్మలను, ఆకృతులను తయారు చేసే పేపర్ క్రాఫ్ట్ నైపుణ్యాలను పిల్లలకు నేర్పించామని తెలియజేశారు. పిల్లల్లో నాణ్యమైన సమయాన్ని ప్రోత్సహించడం, భావోద్వేగాలను వ్యక్తపరచడం, నియంత్రించుకోవడం, సామాజిక నైపుణ్యాలను ప్రోత్సహించడం ,తమ ఊహలకు ఆకృతులను రూపొందించే నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ కళ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. అనంతరం డాన్స్ మాస్టర్ శివ పిల్లలకు వివిధ రకాల పాటలకు నృత్యాలు నేర్పించారు. వేదిక జిల్లా కమిటీ నాయకులు ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పది రోజులు పాటు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఓబుల్‌రెడ్డి, బయారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, వై.సి రెడ్డప్పరెడ్డి, శివారెడ్డి, రామయ్య, ప్రతాపరెడ్డి ఆంజనేయులు, శివ, చక్రపాణి, నాయకులు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలి'

నిరాహార దీక్షల్లో ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో వద్ద మొదటి రోజు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలకు జోనల్ అధ్యక్షులు వినోద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనేళ్లుగా ఆర్‌టిసి ఉద్యోగులకు ఉన్న సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. 1/2019 సర్కులర్ అమలు చేయాలని అక్రమ సస్పెన్షన్ నిలుపుదల చేయాలని అన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరారు. ఇహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, ఎపిఎస్ ఆర్‌టిసిలో మాదిరిగా అమలు చేయాలని 114 జీవోలో పొందుపరిచిన నైట్ హోటల్ బ్యాంక్ రూ.150 నుండి రూ. 400 పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే మంజూరు చేయాలని ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఇఎల్ మంజూరు చేయాలన్నారు. డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు ఎంఎన్ రావు, రీజినల్ నాయకులు వై.ఎస్.రాములు, మునికృష్ణ, సి.ఎస్ రాజు, నరసయ్య, పిఎస్ఎం రాజు, టి.రామానుజు, బిఆర్‌బి నాయక్, సివి రమణ, బిఎస్ రెడ్డి, టి.మధుసూదన్, వి.పి.నాయుడు, ఎ.రెడ్డప్ప పాల్గొన్నారు

హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

'మిట్స్'లో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం(డేటా సైన్స్), గీక్స్ ఫర్ గీక్స్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో ఉత్కంఠభరితమైన 24 గంటల జాతీయ స్థాయి ఇంటర్-ఇన్స్టిట్యూట్‌ఆఫ్ హ్యాకథాన్, ఇంపాసిబ్స్-2025ను విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పరిష్కరించే సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడానికి పాల్గొనేవారిని ప్రేరేపించడం, స్థిరమైన, స్కేలబుల్, సామాజికంగా ప్రభావవంతమైన ఆవిష్కరణలను పెంపొందించడం ఈ హ్యాకథాన్ ప్రాథమిక లక్ష్యం అన్నారు. ఈ హ్యాకథాన్‌లో మొత్తం 246 మంది 73 గ్రూపులుగా పోటీ బృందాలుగా ఏర్పడి హాజరయ్యారని చెప్పారు. ఈ హ్యాకథాన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్‌లెర్నింగ్, ఎడ్‌టెక్, హెల్త్‌కేర్, ఆగ్రోటెక్, స్మార్ట్ సిటీస్, ఎన్విరాన్‌మెంట్, స్టూడెంట్ ఇన్నోవేషన్ వంటి కీలక అంశాలపై విద్యార్థులు దృష్టి సారించారని చెప్పారు. రియల్-టైమ్ ప్రోటోటైప్‌లను రూపొందించడానికి విద్యార్థులు 24 గంటలు కళాశాలలో పనిచేశారని, కోడింగ్, డిజైనింగ్, వ్యాపార ప్రణాళిక, సామాజిక ప్రభావ ఆలోచనలలో వారి నైపుణ్యాలను ప్రదర్శించారని చెప్పారు. ముఖ్య అతిథిగా లెర్నింగ్, గీక్స్ ఫర్ గీక్స్ డైరెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ ఇలాంటి హ్యాకథాన్‌లు బృందాలు, వ్యక్తులను ఒకచోట చేర్చి నిర్దిష్ట సమస్యను, తరచుగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లేదా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన వాటిని పరిష్కరించడానికి ఉపయోగిస్తారని పేర్కొన్నారు. హ్యాకథాన్‌లు వివిధ రకాలుగా ఉంటాయని, అంతర్గత హ్యాకథాన్‌లు, నెట్‌వర్కింగ్, సహకారం, ఆవిష్కరణలను ప్రోత్సహించే వాతావరణంలో కంపెనీ ఉద్యోగులు పరిష్కారాలను సేకరించి క్రౌడ్‌సోర్స్ చేయడానికి అంతర్గత హ్యాకథాన్‌లు ప్రత్యేకంగా ఉంటాయని తెలిపారు. అనంతరం విజేత జట్లకు బహుమతులు అందజేశారు. విద్యార్థి కేంద్రీ కృత కార్యక్రమాలను నిర్వహించడంలో నిరంతర ప్రోత్సాహం, మద్దతు ఇచ్చినందుకు మిట్స్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ్ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - గాలివీడు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రవాణా, యువజన, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత పేర్కొన్నారు. సోమవారం మండలంలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కేవలం భర్త సంపాదన పైనే ఆధారపడకుండా టైలరింగ్ నేర్చుకుని తద్వారా వచ్చే సంపాదనతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, మహిళలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. పట్టణంలో మహిళలకు ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమని, ప్రతి మహిళా టైలరింగ్‌లో మంచి నైపుణ్యం పొందాలన్నారు. ఈ సందర్భంగా హరితను మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాలివీడు ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హరిత

విఆర్ఎపై దాడి అమానుషం

ప్రజాశక్తి- చిట్వేలి

గ్రామ సేవకుల సంఘం కమిటీ, సిఐటియు ఆధ్వర్యంలో ఓబు లవారిపల్లి మండలం గాజుల పంచాయతీలో ఇటీవల పనిచేస్తున్న కె.పెంచలయ్యపై దాడి చేయడం అమానుషమని విఆర్ఎలు పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దార్ మోహన్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై నిత్యం వారికి అందుబాటులో ఉండే గ్రామ సేవకుని పైన అలా ప్రవర్తించడం బాధాకరమని వారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సేవకునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారన్నారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కొరముట్ల సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి, సుబ్బరాయుడు, గంధం నరేష్, పి.శంకరయ్య, వై.పెంచలయ్య, జె.రమణ, మదన్, శివయ్య, టి.నరసింహులు, టి.మారమ్మ, ఎస్.ఖాదరవల్లి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

భూ నిర్వాసితుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - పుల్లంపేట : ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఆర్ఆర్ 5 భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం రాయలసీమ జోన్ బూత్ లెవెల్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి రాజంపేట సబ్ కలెక్టర్ వైకుం నదియాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం పారదర్శకత కల్పించాలని అదేవిధంగా కోదండ రామ దేవాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. కాపుపల్లి దళితవాడకు చెందిన భూ యజమానులు తమ భూములను ఎపిఎండిసి మంగంపేట అభివృద్ధి కొరకు అప్పగించారని పేర్కొన్నారు. భూ నిర్వాసితుల కోసం 2013 భూ సేకరణ, ఆర్ఆర్ చట్టం చేశారని పేర్కొన్నారు. పునరా వాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత కోసం నియమించిన ఆర్ఆర్ కేంద్రాల పనులలో జాప్యం జరుగుతుందని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులను ప్రారంభించి చాలా కాలం అయినప్పటికీ భూ నిర్వాసిత కుటుంబాలకు చట్టం ప్రకారం తగిన న్యాయం జరగక అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డ్రెయినేజీ, పాఠశాల నిర్మాణం, క్రీడా మైదానం, అంగన్వాడీ పాఠశాల భవనం, శ్మశానం, కమ్యూనిటీ హాల్, పార్కు నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

మాట్లాడుతున్న తాలూకా అధ్యక్షులు ఓబులేసు

ఎన్‌జిఒ సంఘం తాలూకా అధ్యక్షులుగా ఓబులేసు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వేకోడూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులుగా పి. ఓబులేసు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు ముఖ్య అతిథులుగా కడప జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు, ఎపి జెఎసి చైర్మన్ బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్ హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా కడప ఎన్‌జిఒ సంఘం ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, పరిశీలకులుగా బి.వేణుగోపాల్ బి.రవికుమార్‌ను జిల్లా అధ్యక్షులు నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్కరే నామినేషన్ వేసినందువల్ల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పి.ఓబులేసు, కార్యదర్శిగా డి.రవీంద్ర వర్మ, కోశాధికారిగా ఎస్‌కెఎండి అస్లాం, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా జె.రవి శంకర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.విజయ్ కుమార్, కె.సంతోష్‌రెడ్డి, డాక్టర్ పి.దేవేందర్ రెడ్డి, ఎన్ చంద్రబాబు, మహిళా ఉపాధ్యక్షులుగా కె.యశోద, జాయింట్ సెక్రటరీలుగా సి.అనసూయ, ఎం.సురేష్, ఎం.శరత్ కుమార్ రాజు, ఏకలూద, మహిళా జాయింట్ సెక్రటరీగా ఎన్ ఉషారాణి గ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

మేడేను జయప్రదం చేయండి

- అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికులు వీరోచితంగా పోరాడి 8 గంటలు పని సాధించుకున్న రోజు మే ఒకటి అని, ఈ సందర్భంగా నిర్వహించే 'మేడే' ను జయప్రదం చేయాలని మండలంలోని కార్మికవర్గ శ్రేణులకు ఎపిఅంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ చిత్రపటం వద్ద అంగన్వాడీలతో కలసి మేడే బుక్‌లెట్లను విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, పేదలకు ప్రయోజనం కలిగించే స్కీంను ప్రయివేట్‌పరం చేయడం చివరకు స్కీమ్ ఎత్తివేసే దిశలో ప్రభుత్వాలుండడం దుర్మార్గమని పేర్కొన్నారు. జనాభాకు తగ్గ కొత్త సెంటర్లు రాకపోవడం, మినీ సెంటర్లు మెయిన్ చేయకపోవడం, ఏళ్ల తరబడి జీతాలు పెంచకపోవడం వంటి అంశాలు ప్రయివేటీ కరణకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. నిర్ణీత పని గంటలు లేని కాలంలో కార్మికులు వెట్టి చాకిరి నుంచి పోరాడి స్వేద రక్త ప్రాణ త్యాగం చేసి 8 గంటలు సాధించారని చెప్పారు. నేడు పాలకులు మళ్లీ 13,14 గంటలు పని చేయిస్తూ చాకిరి చేయించడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులు ఐక్య ప్రతి ఘటనతో తిప్పి కొట్టాలన్నారు. బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను నేడు కేవలం నాలుగు రకాల లేబర్ కోడ్‌లతో రద్దు చేయాలనుకోవడం కార్మిక ద్రోహం కాదా అని ప్రశ్నించారు. సంఘం ఉండకూడదు, హక్కులు ప్రశ్నించకూడదు, కార్మికులు కేవలం పని చేయడానికి మాత్రమే అని యాజమాన్యలకు అనుకూలంగా చట్టాలు మార్చడం సరికాదని అన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తూ రైతులకు గిట్టు బాటు ధరలేకుండా విస్మరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మిక కర్షక ఐక్యత కోసం,హక్కులు చట్టాలు రక్షకై జరుగుతున్న తరుణంలో నాటి మేడే పోరాట స్ఫూర్తి తో ప్రతి ఒక అంగన్వాడీ వర్కర్, హెల్పర్లు, మినీ వర్కర్‌లు సైనికుల్లా కదిలి మేడే ర్యాలీ బహిరంగ సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సిద్దమ్మ, శ్రావణి, సుమలత, సురేఖ, రాజమ్మ, సుహాషిణి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ విశ్వనాథ్ మృతి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైల్వే కోడూర్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మలిశెట్టి విశ్వనాథ్ గుండెపోటుతో మృతి చెందారని ఎపిఒ మృత్యుంజయరావు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు రావడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించగా సోమవారం తెల్లవారుజామున విశ్వనాథ్‌మృతి చందారని, విషయం తెలుసుకున్న డ్వామా పీడీ వెంకటరత్నం, రాజంపేట ఎపిడిపతాప్, ఎంపిడిఒ నాగార్జున, ఓబులవారిపల్లి ఎంపిడిఒ మల్‌రెడ్డి, కోడూరు, రాజంపేట క్లస్టర్ పరిధిలోని ఇంజినీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు విశ్వనాథ్ మృతదేహానికి నివాళులర్పించారు, పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు.

సబ్ జైలులో జడ్జి ఆకస్మిక తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాను సారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సోమవారం రాజంపేట సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖైదీలకు సూచించారు. జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం, వారికి తగు న్యాయ సహాయం అందించడం, మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలు, మరుగుదొడ్లు, వంట గది, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఖైదీలకు మెరుగైన సేవలు అందించకుంటే చర్యలు తప్పవన్నారు. ఏవైనా సమస్యలుంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితి, బద్వేలు మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప ట్రైనీ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.ఆశా ప్రియ, రాజంపేట, బద్వేల్ సబ్ జైళ్ల సూపరింటెండెంట్లు ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

ప్రజాశక్తి- వీరబల్లి

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికి పంద చర్య అని విచక్షణ రహితంగా ప్రవర్తించిన పాకిస్తాన్ ఉగ్రవాదులను ఏరిపారేయాలని రాజంపేట బి.ఎస్.పి నియోజకవర్గ అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిఎస్‌పి అధ్యక్షులు అధ్యక్షుడు బిందెల గౌతమ్ కుమార్ ఆదేశాను సారం కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఇకనైనా ఇలాంటి పిరికిపంద చర్యలు మానుకోవాలని తెలిపారు. ఉగ్రవాదుల పట్ల ఉక్కు పాదం మోపుతామని చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వం ఇలాంటి చర్యలు జరిగినప్పుడు ఆ ఉక్కు పాదం ఏమైందో తెలపాలని డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ప్రజలు బిజెపి పట్ల విశ్వాసం కోల్పోయారని వచ్చేది కచ్చితంగా బిఎస్‌పి అని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని బిజెపికి గట్టిగా బుద్ధి చెబుతారని తెలిపారు. మృతుల కుటుంబాలకు నష్టపరహారం చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మన్నూరు గ్రామస్తులు

తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ వీధిలో మంచినీటి పైపులైను ఏర్పాటు చేసి నీటి సరఫరా అయ్యేలా చూడాలని పట్టణ పరిధిలోని 8వ వార్డు మన్నూరు బలిజవీధికి చెందిన ప్రజలు సోమవారం రాజంపేట మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వీధిలో నివాసం ఉంటున్న వారు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని తెలుగు అధ్యాపకులు, కవి పండితులు గంగనపల్లి వెంకటరమణ, ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు డి.చెంగల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయురాలు మల్లెల హైమావతి, భాస్వంత్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనేళ్లుగా మంచినీటి సరఫరాకు నోచుకోక తాము ఫ్లోరైడ్‌తో కూడిన బోరు నీళ్లను తాగుతున్నామని పేర్కొన్నారు. తద్వారా వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి తమ వీధికి మంచినీటి పైపులైన్‌తో పాటు మురుగునీటి పారుదల కాలువలను కూడా ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై మున్సిపల్ సానుకూలంగా స్పందించి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

వాహనదారుడుకి వేగం కన్నా ప్రాణం మిన్న అనే నినాదంతో ప్రయాణం చేయాలని ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ వాహనదారులకు తెలియజేశారు. కడప చెన్నై జాతీయ రహదారిలో రెడ్డిపల్లి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్‌సి, బండికి సంబంధించి పత్రాలను ఉంచుకోవాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు చలానాలు విధించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు నిదానంగా వెళ్లి గమ్యస్థానాలను చేరుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించి బంగారు భవిష్యత్తుకు బాటగా ఉంటుందన్నారు. రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మహిళ చట్టాలు అవగాహన కల్పించారు. వాహనాలు నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని హెచ్చరించారు. లారీ వాహనదారులు టాప్‌పై ప్రయాణికులను ఎక్కించుకోవడం నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి ఉచిత బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడామైదానంలో మే 1వ తేది నుండి 31వ తేది వరకు నిర్వహించే ఉచిత బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రవిచందర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు, సాయంత్రం 4:30గంటల నుండి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పౌష్టికాహారం అందిస్తామన్నారు. మహిళా కోచ్ లేనందు వలన అబ్బాయిలకు మాత్రమే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు రెడ్డి, విశ్వనాథరెడ్డి, నరసింహశాస్త్రీ, చంద్రమోహన్, సాయిభార్గవ్, హేమంత్ యాదవ్, కోచ్‌లు అంజిబాబు, కేశవ, అఫ్రోజ్, యూసఫ్, భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

ప్రజాశక్తి -చిట్వేలి

నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు వరించడం గర్వించదగ్గ విషయమని రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్ కెకె.చౌదరి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమలో ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విభిన్న పాత్రలతో, వేషధారణతో ప్రపంచంలో ఉన్న నలుమూలల తెలుగోడి గొప్పతనం చాటి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు అంత గొప్ప వ్యక్తికి కుమారుడుగా జన్మించిన బాలకృష్ణ తండ్రికి మించిన తనయుడుగా పేరు ప్రతిష్టలు చూరగన్నారన్నారు. చలనచిత్ర పరిశ్రమలోనే కాకుండా రాజకీయంగా ప్రజలకు మంచి సేవలు అందించడంలో ఆయనకు సాటి లేరన్నారు. అతని నటనను గుర్తించి పద్మభూషణ్‌తో సత్కరించడం గర్వించదగ్గ విషయమన్నారు.

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జమ్మూ కాశ్మీర్ వహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడికి రైల్వే కోడూరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు సోమవారం సాయంకాలం టోల్గేట్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో వద్ద నిరసన తెలియజేశారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఉగ్రదాడిలో మృతి చెందిన టూరిస్టుల ఆత్మకు శాంతి కలగాలంటూ మనం పాటించి అనంతరం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా విలేకరులు ఎస్.రాజశేఖర్ వేణుగోపాల్ చౌదరి, శ్రీనివాసరాజు, సునీల్ కుమార్, ఇర్ఫాన్ పఠాన్, ఎం.వెంకటేశ్వర్లు, పులి వెంకటేష్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు రమేష్, పి.ప్రసాద్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పొలాల వద్దకు వెళ్లేందుకు దారి కల్పించండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కలెక్టర్ సార్.. మాపై కరుణ చూపండి అంటూ రాజంపేట మండల కేంద్రంలోని కూచివారిపల్లిలో ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలం నుండి పొలాల వద్దకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండలం కుచివారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 381/3, 381/5, 381/8, 381/9, 381/10, ఇతరులకు సంబంధించిన సుమారు 20 ఎకరాల పైన భూమి ఉందని తెలిపారు. 100 సంవత్సరాల నుంచి ప్రధాన రహదారుల నుండి శ్రీనివాసులు నాయుడు పొలం ఆనుకుని రాస్తా ద్వారా వెళ్లి పొలాలకు నీళ్లు పెట్టు కుంటూ వ్యవసాయం చేసేవారమన్నారు. ఇటీవల కాలంలో ఓ వ్యక్తికి సంబంధించి 46 సెంట్లు ఉంటే దానికి తోడు ప్రభుత్వ భూమి రాస్తా కూడా ఆక్రమించుకొని ఎత్తయిన గోడ నిర్మించి అటువైపు పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా నిర్మించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తహశీల్దార్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేశామని తలపనేని శివప్రసాద్‌తో పాటు మరి కొంతమంది రైతులు తెలిపారు. పొలాలకు వెళ్లేందుకు దారి లేనందువల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరామన్నారు. పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోతే పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న రైతులు

'శ్మశానాన్ని ఆక్రమించారు..న్యాయం చేయండి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పూర్వీకుల నుండి తాము మేటిగడ్డ కాలువలో శ్మశానాన్ని ఏర్పాటు చేసుకొని చనిపోయిన వారిని అక్కడే సమాధి చేసుకుంటున్నామని, అయితే ఇటీవల కొంతమంది రియల్టర్లు శ్మశానానికి అనుకున్న ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వ స్థలాన్ని, శ్మశానాన్ని ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారంటూ కన్నేమడుగువారిపల్లి, ఎగువ కొనుకుంట్లవారిపల్లి, దిగుకుంట్లవారిపల్లి గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం వారు శ్మశానం దగ్గరికి వచ్చి తమ పూర్వీకుల నుంచి ఉంటున్న మేడిగడ్డ కాలువలో స్మశానం ఏర్పాటు చేసుకుని చనిపోయిన వారిని ఇక్కడే పూడ్చుకుంటున్నామన్నారు. ఇదే భూమిలోనే మేడిగడ్డ కాలువ వెళుతుందని కొంత ప్రభుత్వ స్థలం కూడా ఉందని తెలిపారు. కొంతమంది రియల్టర్లు ప్రైవేటు వ్యక్తుల వద్ద కొంత ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి ఆ ముసుగులో ప్రభుత్వ స్థలంతో పాటు శ్మశానాన్ని ఆక్రమించుకున్నారన్నారు. శ్మశానానికి దారి కూడా వదలడం లేదని అడిగితే దౌర్జన్యం చేయడం, దిక్కున చోట చెప్పుకోండని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు సిపిఎం దృష్టికి తీసుకెళ్లడంతో సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులతో కలిసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్టర్లు రెచ్చిపోయి ప్రభుత్వ స్థలాలు, స్మశానవాటికలు ఆక్రమించుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ స్థలాలను స్మశానవాటికలను రక్షించాలని కోరారు. గ్రామస్తులతో కలిసి ఉన్నతాధికారులను నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ విషయమై స్థానిక విఆర్ఒను వివరణ అడిగేందుకు ప్రయ త్నించగా వారు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను స్మశానవాటికలస్థలాలను రక్షించాలని గ్రామస్తులు రెడ్డప్ప, రాజన్న, రామ్మూర్తి, చంద్రశేఖర్, రవి, నారాయణ, నరసింహులు, సుధాకర్, నందినీలు కోరుతున్నారు.

రియల్టర్లు ఆక్రమించిన శ్మశానవాటిక స్థలాన్ని చూపుతున్న గ్రామస్తులు

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

చైతన్య సంస్థలో పిల్లలకు ఏర్పాటు చేసిన భోజన సదుపాయం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి చక్రపాణి, చైతన్య సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎంపీ ఆనందన్ పిలుపునిచ్చారు. సోమవారం పాత్రికేయుడు ఈశ్వర్‌రెడ్డి కుమారుడు నిశాంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఉదయం చైతన్య సర్వీస్ సొసైటీలో అల్పాహారం, మధ్యాహ్నం ఆనంద నిలయంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి చక్రపాణి, ఆనందన్ మాట్లాడుతూ సమాజంలో నిరాధారణకు గురైన వృద్ధులు, చిన్నారులకు తమ సంస్థలలో ఆలనా, పాలన చూస్తున్నామని, ఇందుకు దాతల సహకారం మరువలేదని తెలిపారు. ఈశ్వర్ రెడ్డి, రేవతి తమ పిల్లల పుట్టిన రోజు వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకుని స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఈశ్వర్ రెడ్డి, రేవతి మాట్లాడుతూ తమకు తెలియకుండానే ఎంతో సొమ్మును వృథా చేస్తుంటామని, మనకున్న దాంట్లో ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే వచ్చే సంతృప్తి ఎక్కడా దొరకదన్నారు. చైతన్య సర్వీస్ సొసైటీ, ఆనంద నిలయంలో సౌకర్యాలు బేషుగ్గా ఉన్నాయని కితాబిచ్చారు. భవిష్యత్తులో ఈ సంస్థలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చైతన్య సర్వీస్ సొసైటీ జనరల్ సెక్రటరీ కవితా రాణి, ఆనంద నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫలహారాలు అందజేత

బి.కొత్తకోట : మడుమూరు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి సతీమణి మీనా పుట్టినరోజు సందర్భంగా సోమవారం బెంగుళూరు నగరంలోని విద్యారణ్య ఆశ్రమంలోని 120 మంది వృద్ధులు, వికలాంగులకు కేకు, పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజు వేడుకలు నిరాడంబరంగా నిర్వహించుకుంటారని, అందుకయ్యే సొమ్ముతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పుట్టినరోజు వేళ ఆశ్రమంలో కేకు, పండ్లు, మిఠాయిలు పంపిణీ కార్యక్రమం నిర్వహించిన మధుసూదన్‌రెడ్డి సతీమణి మీనాను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ మిండిగళ్ళు లక్ష్మణ్, అనిల్ పాల్గొన్నారు.

వట్టి పసుపు తయారీలో రైతులు నిమగ్నం

ప్రజాశక్తి - చాపాడు

పచ్చ బంగారంగా చెప్పుకునే పసుపు పంట నూర్పిడిని పూర్తి చేసిన రైతులు వట్టి పసుపుగా తయారీ పనులను ముమ్మరం చేశారు. పొలంలో నుంచి తీసిన కొమ్ములను (పచ్చికొమ్ములు) రైతులు ఉడకబెట్టి ఎండబెడతారు. దీన్ని వట్టి పసుపు అంటారు. పసుపు పంటను ఉడికిం చేందుకు కూలీలు, సామగ్రి, ఇంధన ఖర్చులు అధికమవ్వడంతో ఈ ఏడాది రైతులు అధికంగా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. యంత్రం ద్వారా ఒకే సారి మూడు పుట్ల వరకు పచ్చి పసుపును ఉడికించే వెసలుబాటు ఉం టుంది. తద్వారా పని సులభం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. యం త్రానికి ఒక రౌండ్‌కు రూ.800 బాడుగ చెల్లించాల్సి వస్తుంది. వేడి చేసేం దుకు కావలసిన కలప, రబ్బర్ టైర్లు మాత్రం రైతులు నమకూర్చాల్సి ఉంది. అయితే యంత్రం ద్వారా ఉడికించిన పసుపు త్వరగా ఎండు పసుపుగా మారుతుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ఎకరా పొలంలోని పసుపును ఉడికించేందుకు రెండుమూడు రోజుల సమయం పట్టేది. ప్రస్తుతం యంత్రం ద్వారా 4గంటలలోనే పూర్తి అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎండు పసుపునకు గిట్టుబాటు ధర ప్రస్తుతం రూ.9వేలు మాత్రమే ఉందని రైతుల్లో దిగులు పట్టుకుంది. పచ్చి పసుపు ధరలు మరీ దయనీయంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టి పసుపు ధర కేవలం రూ.5వేలులోపు మాత్రమే పలుకుతోంది. రైతులు వట్టి పసుపుగా మార్చేందుకే ఇష్టపడుతున్నారు. గిట్టుబాటు ధర ప్రస్తుతం ఉన్న దిగుబడికి క్వింటా రూ.12వేలకు పైగా నిర్ణయించాలని కొరుతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా నామమాత్రంగా ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో సుమారుగా 375 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారు. చాపాడు, సీతారామాపురం, అల్లాడుపల్లె, చిన్నగురువలూరు, పెద్దగురువలూరు, లక్ష్మీపేట, కేతవరం, సోమాపురం, సిద్దారెడ్డిపల్లె గ్రామాల పరిధిలో పసుపు పంటను ఉడకబెడుతున్నారు.ఎకరాకు 25 పుట్ల వరకు దిగుబడి వస్తోంది. తెగుళ్ల బారిన పడిన పంట మాత్రం 20 క్వింటాళ్లకే పరిమితం అవుతోంది. పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.1లక్ష నుండి రూ.1.30 లక్ష వరకు ఖర్చులు అయ్యాయని రైతులు తెలిపారు. ఏడాది పంట కావడంతో విత్తనం కొనుగోలు దగ్గర నుండి సాగు, కూలీలు, ఎరువులు, మందులు కలిపి అధికంగా ఖర్చులు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బి.మఠం మండలాల్లో 2500 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారు. మైదుకూరు మండలంలో సాగైన 1,125 ఎకరాల్లోని పసుపు పంటను రైతులు విత్తన పసుపు కోసం దుక్కిళ్లు సాగించలేదు. ఏప్రిల్ చివరి వారం, మే నెలల్లో దుక్కిళ్లు సాగిస్తామని రైతులు తెలిపారు. పసుపు ధరలు కడప మార్కెట్‌లో కంటే మహారాష్ట్ర శాంగ్లీ మార్కెట్‌లో రూ. వెయ్యి ఎక్కువగా ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

యంత్రం ద్వారా పసుపు కొమ్ములను ఉడికిస్తున్న కూలీలు

ఉడికించిన పసుపు కొమ్ములను ఆరబెట్టిన రైతులు

శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి భజన తగ్గించుకొని శాంతిభద్రతల మీద దృష్టి పెట్టాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు నానాటికీ తీసికట్టు నాగంభట్లు అన్నట్లు ఉందన్నారు. కూటమి పరిపాలనలో ఎవరికీ రక్షణ లేదన్నారు. రాష్ట్రంలో వేట కొడవళ్లు వీరవిహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగులు విచ్చలవిడిగా సాగుతున్నట్లు చెప్పారు. పట్టపగలు కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చిప్పగిరి లక్ష్మి నారాయణను టిప్పర్‌తో ఢీకొట్టి వేట కొడవళ్లతో అతి దారుణంగా నరికి చంపారన్నారు. ఈనెల 22న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలుకు చెందిన టిడిపి నేత వీరయ్య చౌదరిని కూడా ప్రత్యర్థులు చంపారన్నారు. ఇలా చెబుతూ పోతే కొండవీటి చాంతాడు అవుతుందని తులసిరెడ్డి అన్నారు. నేర చరిత్ర గల ఎమ్మెల్యేలలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. 79 శాతం మంది ఎమ్మెల్యేలకు నేర చరిత్ర ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అంతా బాగుంది, స్వర్ణాంధ్ర, సంతోష ఆంధ్ర, సంపద ఆంధ్ర అంటూ డైలాగులు చెబుతున్నారని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా డైలాగులు మానుకొని, కాంగ్రెస్‌నేత లక్ష్మి నారాయణను చంపిన వారిని చట్టపరంగా శిక్షించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఫేస్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిబంధనలు పాటించని ఫేస్ జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్ జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవడంలో ఆర్‌జెడి, ఆర్ఐఒ విఫలమయ్యారని ఆరోపించారు. నీట్, జెఇఇ మెయిన్స్, ఎంసెట్ వంటి పేర్లతో కోచింగ్ సెంటర్‌ను కాలేజీగా మార్చారన్నారు. గతేడాది అనుమతి లేకున్నా కాలేజీ నడిపి ఇంటర్ అడ్మిషన్లు చేసుకుంటే సంబంధిత అధికారులు ఇలాంటి కాలేజీలపై చూసీచూడనట్లు వ్యవహరించారన్నారు. మోసపూరిత కాలేజీలపై చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకుడు బాబు, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య జిల్లా కన్వీనర్ బయన్న పాల్గొన్నారు.

నేడు కడపలో ఉద్యాన సమ్మేళనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్: ఉద్యాన పంటలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఆ శాఖ ఈనెల 29న మంగళవారం కడప పట్టణ రాయచోటి రోడ్డులో ఉన్న మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యాన సమ్మేళనం నిర్వహి స్తున్నట్లు పులివెందుల ఉద్యాన అధికారి రాఘు వేంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తలతో పంట సాగుపై ప్రసంగాలు, ఉద్యాన రంగంలో ఉన్న వివిధ నిష్ణాతులచే ప్రసం గాలు, ఆధునిక సాంకేతికతపై ప్రసంగాలు రైతులు, వ్యాపారస్తులు, ఎగుమ తిదారులచే మార్కెటింగ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉద్యాన రంగంలో నూతన సాంకేతిక, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాతావరణ మార్పులు, మార్కెటింగ్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యకరం

ప్రజాశక్తి - ముద్దనూరు: రసాయన రహిత వ్యవసాయం ఆరోగ్యానికి హానికరమని, ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్య కరమని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య తెలిపారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య భవనంలో సోమవారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం గురించి ఖరీఫ్ ప్రణాళికపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులకు ఎఒ వెంకటక్రిష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులు సహజ సిద్ధసాగుపై దృష్టి సారిం చాలన్నారు. ప్రపంచం ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతుందన్నారు. ఖరీఫ్ ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మోడల్ మేకర్ నూజహత్, మండల అధ్యక్షులు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి, వెలుగు ఎపిఎం అపర్ణ దేవి, సిబ్బంది రామసుధ, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పులివెందుల స్థితిగతులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు రమణ

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో 'వేసవి సెలవులలో సరదాగా నేర్చుకుందాం' అనే మెటీరియల్‌ను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌లో వేసవిలో సరదాగా గడపడం కోసం వినోదాన్ని పంచే మైండ్ గేమ్స్, రంగులు వేయడం, పదకేళి, మెదడుకు మేత, నిజ జీవిత గణితం, మైండ్ మార్పింగ్ వంటి వివిధ అంశాలు మెటీరియల్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ మెటీరియల్ సెలవుల్లో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సరదాగా పిల్లలు నేర్చుకోవచ్చున్నారు.

రేపటి నుంచి మహాభారత యజ్ఞం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో బుధవారం మహాయభార యజ్ఞం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఎం. రమేష్ రెడ్డి, ఎ. నాగభూషణ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పేర్కొన్నారు మహాభారత యజ్ఞం నిర్వహించే ప్రాంతంలో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి సస్యమంగా ఉంటుందని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉంటారని వారు అభిప్రాయపడ్డారు. ప్రతి మండలంలోని 13 గ్రామాల ప్రజలేగాక వీరబల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి మండలాల వాసులు మహాభారతజ్ఞానికి హాజరవుతారని పేర్కొన్నారు. మహాభారతంలోని 18 పర్వాలు పగలు హరికథ రూపంలోనూ, రాత్రులు నాటక రూపంలోనూ నిర్వహిస్తారన్నారు. మహాభారత యజ్ఞం ప్రారంభానికి ముందు భారతంలోనే శ్రీకృష్ణుడు పంచ పాండవులు ద్రౌపతి విగ్రహాలను మండలంలో ఊరేగిస్తారన్నారు.

నేడు ములకలచెరువు మండల సమావేశం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హరినారాయణ తెలిపారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి మండల ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధి, తాగునీటి సమస్య తదితర అంశాలపై చర్చిస్తున్నట్టు తెలిపారు.

కోర్టులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమల్‌రెడ్డి కార్యదర్శి గఫర్ల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులను న్యాయమూర్తి అభిరుందించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 41 రోజుల పాటు వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో క్విజ్, ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు కృష్ణప్ప, సచివాలయ అధికారి రెడ్డిసుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి రమాపతి

క్రైం కార్నర్

ఆటో, లారీ ఢీ : ఇద్దరు మృతి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయితీ సమీపంలో గుండాలేరు బ్రిడ్జి వద్ద ఆటో,లారీ ఢీకొనడంతో నందలూరుకు చెందిన ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు అరవపల్లికి చెందిన సుహెల్ ఖాన్ (16), జహారాభి (60)గా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బ్రేక్ వైర్ కట్ అయి ఆటో బోల్తా పడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం చెర్లోపల్లికి చెందిన 10 మంది భక్తులు సోమవారం ఆటోలో తంబళ్లపల్లె మల్లయ్య కొండకు వచ్చారు. దర్శనం చేసుకుని తిరిగి బయలుదేరారు. ఘాట్ రోడ్డులో ఆటో బ్రేక్ వైర్ కట్ అవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన భక్తులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండ వద్ద బి.కొత్తకోట మండల వాసి అనుమానస్పద స్థితిలో మృతి చెందడం సోమవారం సాయంత్రం వెలుగు చూడటంతో కలకలం రేపుతోంది. చేతులపైన కోసుకున్నట్లు గీతలు కనిపించడం, కాళ్లకు వేకున్న చెప్పులు అలాగే ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మృతుడు బి.కొత్తకోట మండల వాసిగా అనుమానిస్తున్నారు. ఘటన సమాచారం అందగానే ఎస్ఐ లోకేష్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకున్న యువకుడు